డీఈవో కార్యాలయంలో రిపోర్టు చేసిన అభ్యర్థులు

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: డీఎస్సీ 2024లో ఎంపికై ప్రభుత్వం నుంచి ఆర్డర్లు పొందిన అభ్యర్థులు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో రిపోర్టు చేశారు. హైదరాబాద్‌లో ఈ నెల 9న ఆర్డర్లు తీసుకున్న వారు 10, 11 తేదీల్లో డీఈవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్లలో రిపోర్టు చేసేందుకు హాజరయ్యారు. మొత్తం 535 మంది అభ్యర్థులు హాజరై నివేదించినట్లు అధికారులు తెలిపారు. ఆయా అభ్యర్థులకు ఇంకా పోస్టింగ్ ఆర్డర్లు ఇవ్వలేదు. ప్రభుత్వం నుంచి పోస్టింగ్ ఆర్డర్లపై ఎలాంటి సమాచారం లేదు.


నల్గొండ డీఈవో కార్యాలయంలో రిపోర్ట్ చేయడానికి వచ్చిన ఉపాధ్యాయులు

అంతర్జాతీయ స్థాయిలో విద్యనందించడమే లక్ష్యం


మునుగోడు: కల్వకుంట్లలో భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, అదనపు కలెక్టర్ పూర్ణచందర్

మునుగోడు, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ పాలనలో విద్య, వైద్యంపై నిర్లక్ష్యం చేసిన కేసీఆర్ కుటుంబం ప్రాజెక్టుల పేరుతో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆరోపించారు. కులమతాలకు అతీతంగా మానవత్వంతో ఆలోచించి అంతర్జాతీయ స్థాయిలో విద్యను అందించాలనే సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.5 వేల కోట్ల నిధులను ఖర్చు చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా సమీకృత గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మునుగోడు మండలం కల్వకుంట్ల గ్రామంలో 24 ఎకరాల్లో రూ.100 కోట్లతో నిర్మించనున్న యంగ్ ఇండియా సమీకృత గురుకుల విద్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి మాట్లాడారు. అదనపు కలెక్టర్ పూర్ణచందర్, డీసీసీబీ ఛైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, డీపీవో మురళి, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కైలాష్‌నేత తదితరులున్నారు.

పండగ వేళ.. జనకళ



రాష్ట్రంలో బతుకమ్మ, దసరా పండగలను పల్లె, పట్టణాల్లో ప్రజలు వారికి ఉన్నంతలో ఉత్సాహంగా నిర్వహించుకుంటారు. ఈ క్రమంలో శుక్రవారం దుస్తులు, ఇతర సామగ్రిని కొనుగోలు చేసేందుకు జనం భారీగా రాగా.. చండూరు పట్టణం జనకళను సంతరించుకుంది. - న్యూస్‌టుడే, చండూరు

యాదాద్రిలో సేవోత్సవాలు

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో శుక్రవారం నిత్య పూజలతో పాటు సంప్రదాయ కైంకర్యాలను ఆలయ ఆచారంగా కొనసాగించారు. వేకువజామున సుప్రభాతం చేపట్టారు.

దసరా శుభాకాంక్షలతో...

ఈనాడు, నల్గొండ

చెడుపై మంచి విజయానికి గుర్తుగా చేసుకునేదే విజయదశమి. దీనిని 'దసరా' అని 'దశహరా' అని పిలుస్తారు. అంటే పది పాపాలను హరించేది అని అర్థం. దేవదానవులు పాల సముద్రాన్ని మదించినప్పుడు అమృతం జనించిన శుభముహూర్త దినమే ఈ విజయదశమి. తిథి, వారం, వర్జ్యం, తారాబలం, గ్రహబలం, ముహూర్తం చూడకుండా ఈ రోజున ఏ కార్యక్రమాలను ప్రారంభించినా, అంకురార్పణ చేసినా విజయాలు చేకూరుతాయని నమ్మకం.

అన్నదాతకు మరింత అండ

సుమారు రెండున్నర లక్షల ఎకరాలకు సాగు నీరు, 560 గ్రామాలకు తాగునీరు అందించే ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుతో పాటూ డిండి ఎత్తిపోతల, బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. వచ్చే రెండేళ్లలో పూర్తయితే అన్నదాతకు మరింత అండ దొరకనుంది. ఏళ్లుగా నిరీక్షిస్తున్న ఈ ప్రాజెక్టుల పూర్తితో ఉమ్మడి నల్గొండ జిల్లాతో పాటూ హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాల్లోని చాలా ప్రాంతాలకు తాగునీటి సమస్య తీరనుంది.



ఉద్యోగుల్లో గంపెడాశలు..

కొత్త ప్రభుత్వంలోనైనా తమకు పీఆర్‌సీతో పాటూ పెండింగ్‌లో ఉన్న డీఏలు వస్తాయని ఉద్యోగులు గంపెడాశలు పెట్టుకున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 35 వేల మంది వరకు ప్రభుత్వ ఉద్యోగులున్నారు. మరో 10 వేల మంది వరకు పెన్షనర్లు ఉంటారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకూ సకాలంలో వారి రిటైర్మెంట్ డబ్బులు రావడం లేదు.

★ ప్రభుత్వం సైతం ఉద్యోగుల డిమాండ్లకు సానుకూలంగా ఉండటంతో తమకు త్వరలోనే మరో విజయదశమి రానుందని నమ్ముతున్నారు.



గతేడాదితో పోలిస్తే ఈ పండగ ఉమ్మడి జిల్లాలోని పలువర్గాలకు ప్రత్యేకం కానుంది. గతేడాది సకాలంలో వర్షాలు పడక, ప్రాజెక్టుల కింద పడావుగా ఉన్న భూములు ఇప్పుడు పొలాలతో కళకళలాడుతున్నాయి. ఏళ్ల నుంచి ఉద్యోగాల కోసం నిరీక్షిస్తున్న నిరుద్యోగులకు ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్లు వేయడంతో పాటూ నియామకాల్లోనూ వేగం పెంచడంతో వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పారిశ్రామికీకరణలో ఇతర జిల్లాలతో పోలిస్తే పరిస్థితి కొంత మెరుగ్గా ఉన్నా.. రహదారి, రైలు మార్గాలతో పాటూ వాయుమార్గం సైతం సమీపంలో అందుబాటులో ఉన్న ఉమ్మడి జిల్లాలో.. మరిన్ని పరిశ్రమలు స్థాపించి యువతకు వచ్చే దసరాలోపు కొలువులు ఇస్తేనే వారికి నిజమైన దసరా.

నిరుద్యోగుల్లో ఆనందం

ఏళ్లుగా నోటిఫికేషన్లు లేక, పరీక్షలు రాసినా ఫలితాలు రాక నిరీక్షిస్తున్న నిరుద్యోగులు ప్రస్తుతం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత ఆరు నెలల కాలంలోనే విద్యుత్తు, నీటిపారుదల శాఖలో ఇంజినీర్ల పోస్టులను భర్తీ చేశారు. విద్యాశాఖలో గురుకులాలు, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు ఉపాధ్యాయులను వేల సంఖ్యలో భర్తీ చేశారు. చాలా మంది ఇప్పటికే బాధ్యతలు స్వీకరించగా.. ఒకట్రెండు రోజుల్లో గురువులు బడులకు వెళ్లనున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 1200 మంది ఉపాధ్యాయులు కొత్తగా విధుల్లో చేరనున్నారు. గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలకు రంగం సిద్ధం కాగా.. గ్రూప్ 2, గ్రూప్ 3 పరీక్షలు త్వరలోనే జరగనున్నాయి.

★ ఈ పరీక్షలన్నీ పూర్తి చేసి సకాలంలో పోస్టులను భర్తీ చేస్తే నిరుద్యోగుల్లో మరింత పండగ కళ రానుంది.







వేగంగా..పారిశ్రామికీకరణ

ఉమ్మడి జిల్లాలో చిన్న, మధ్యతరహా, సూక్ష్మ కంపెనీలన్నీ సుమారు 6 వేలకు పైగా ఉన్నాయి. ఇందులో ఎక్కువగా ఫార్మా కంపెనీల్లోనే ప్రజలు ఉపాధి పొందుతున్నారు. మానవ వనరులున్నా.. వారికి అవసరమైన నైపుణ్యాలు, అవకాశాలు లేకపోవడంతో చాలా మంది ఇంకా ఉపాధి కోసం ఎదురుచూసి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన దుస్థితి. రాజధాని సమీపంలోని ప్రాంతాల్లో పరిశ్రమలను స్థాపించే వారికి ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇచ్చి రాయితీలు కల్పిస్తోంది. ఇటీవలే రూ.3 వేల కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టడానికి పలు కంపెనీలు ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నాయి. ★ ఏటా ఉమ్మడి జిల్లాలో ఇంజినీరింగ్ విద్యార్థులు వేల సంఖ్యలో చదువు పూర్తిచేసుకుంటున్నా అందులో కేవలం 10 శాతం మందికే ఉద్యోగాలు లభిస్తున్నాయి. సరైన నైపుణ్యాలు లేకపోవడం తదితర కారణాలతో వారు ఉద్యోగాలు పొందడం లేదు. నల్గొండలో ఇటీవలే నైపుణ్య శిక్షణా కేంద్రానికి శంకుస్థాపన చేశారు. త్వరలోనే పూర్తయి నైపుణ్యాలకు తగ్గ ఉద్యోగాలు లభిస్తేనే యువతకు నిజమైన దసరా.

నిండుగా జలాలు..

రెండు రాష్ట్రాల వరప్రదాయిని నాగార్జునసాగర్‌తో పాటూ మూసీ, డిండి, శాలిగౌరారం జలాశయాలు, వాగులు, వంకలు నిండుకుండలుగా మారడంతో మూడు జిల్లాల్లోనూ పొలాలు కళకళలాడుతున్నాయి. రాష్ట్రంలోనే అత్యధికంగా 10.56 లక్షల ఎకరాల్లో వరి సాగును ఉమ్మడి జిల్లాలోనే సాగు చేస్తున్నారు. సుమారు 8 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతుండగా.. ప్రస్తుతం పంటలు కోతల దశకు చేరాయి. ఇప్పటికే రాష్ట్రంలోనే తొలిగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్ని నల్గొండ జిల్లాలోనే ప్రారంభించారు. సన్నాల సాగు గతంతో పోలిస్తే గణనీయంగా పెరగడం, కొనుగోలు కేంద్రాల ద్వారానే ఈ ఏడాది మూడు జిల్లాల్లో సుమారు 13 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేస్తున్నారు. కొనుగోళ్లు సజావుగా సాగి అన్నదాతకు సకాలంలో వారి ఖాతాల్లో డబ్బులు జమయితేనే వారికి నిజమైన దశమి.

★ అధికారులు ఈ దిశగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

గీత కార్మికుల సంక్షేమానికి కృషి: మండలి ఛైర్మన్ గుత్తా

నకిరేకల్, న్యూస్‌టుడే: గీత కార్మికుల సంక్షేమానికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తుందని శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి చెప్పారు. నకిరేకల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో కల్లుగీత కార్మికులకు కాటమయ్య రక్షణ కిట్లను ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి శుక్రవారం పంపిణీ చేసి మాట్లాడారు. కల్లుగీత వృత్తిపై ఆధారపడిన కార్మికులకు రక్షణ కల్పించేందుకు రూ.పది వేలతో రక్షణ కిట్లను ప్రభుత్వం అందిస్తోందన్నారు. కార్మికులు తాటి చెట్లపై ప్రమాదాలకు గురి కాకుండా ఈ కిట్లు కాపాడుతాయన్నారు. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ అమలు చేసేందుకు ఈ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. ఈ నెలాఖరు నాటికి మరో రూ.10 వేల కోట్లను రుణమాఫీ కోసం ప్రభుత్వం విడుదల చేస్తుందన్నారు. ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ కల్లుగీత కార్మికులకు గీత వృత్తిలో ప్రమాదాలు జరగకుండా ఈ కిట్లు కాపాడుతాయన్నారు. మొదటి విడతగా నియోజకవర్గంలో శిక్షణ పొందిన 208 మందికి వీటిని అందజేస్తున్నామన్నారు. పుర ఛైర్‌పర్సన్ చౌగోని రజిత, యాదాద్రి ఈఎస్ సైదులు, జిల్లా బీసీ సంక్షేమ అధికారి వి.రమేశ్, తహసీల్దారు జమీరొద్దీన్, నకిరేకల్ ఆబ్కారీ సీఐ మల్లయ్య, పీఏసీఎస్ ఛైర్మన్ వెంకటేశ్వరరావు, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ శంభయ్య, పుర వైస్‌ఛైర్‌పర్సన్ ఉమారాణి, శ్రీదేవి పాల్గొన్నారు.


రక్షణ కిట్లను పంపిణీ చేస్తున్న మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే వీరేశం, పుర ఛైర్‌పర్సన్ రజిత









గెలుపు సంకేతం.. విజయ దశమి

జయానికి సంకేతంగా హిందువులు జరుపుకొనే విశిష్టదినం దసరా. ఆశ్వయుజ శుద్ధపాడ్యమి మొదలు నవమి వరకు తొమ్మిది రోజులు దేవీనవ రాత్రులు, పదోరోజు విజయదశమి(దసరా) పండగ జరుపుకొంటారు. ఇది ముఖ్యంగా శక్తి ఆరాధనకు ప్రాధాన్యం ఇచ్చే పండగ. కొన్ని ప్రాంతాల్లో కొందరు మొదటి మూడురోజులు పార్వతీదేవికి, తదుపరి మూడురోజులు లక్ష్మీదేవికి, మిగిలిన మూడురోజులు సరస్వతి దేవికి పూజలు చేస్తారు. సామాన్యులే కాక యోగులు నవరాత్రుల్లో అమ్మవారిని పూజిస్తారు. ఈ పండగ సందర్భంగా బొమ్మల కొలువులు ఏర్పాటు చేయడం ఆనవాయితీ. ఆలయాల్లో అమ్మవారిని ఒక్కోరోజు ఒక్కో అలంకరణలో పూజించి పదోరోజు పార్వేట చేస్తారు. జమ్మిచెట్టు ఉన్న ప్రదేశంలో పార్వేట చేయడం ఆనవాయితీ.

– మోత్కూరు, న్యూస్‌టుడే:



వేడుకలు ఇలా..

విజయదశమి వేడుకలను ఏటా సూర్యాపేట, నల్గొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో ఘనంగా జరుపుకొంటున్నారు. పండగ రోజున గ్రామదేవతలైన గడి మైసమ్మ, కోట మైసమ్మలకు పూజలు చేస్తారు. ఆయుధాలను పెద్ద గ్రామపెద్దలతో కలిసి వాటిని పూజిస్తారు. జొన్న చొప్పకట్టపై సొరకాయను ఉంచి నరుకుతారు. అక్కడి నుంచి ప్రదర్శనగా వెళ్లి జమ్మిచెట్టు వద్దకు చేరుకొని పూజారి సమక్షంలో పూజలు చేస్తారు. అక్కడికి వచ్చిన పెద్దలు, విద్యావంతులతో 'శమీ శమయతే పాపం, శమీ శత్రు వినాశనీ, అర్జునస్య ధనుర్ధారీ రామస్య ప్రియదర్శినీ' అంటూ అందరితో పత్రాలు రాయించి వాటిని జమ్మి చెట్టు వద్ద కట్టి పూజలు చేస్తారు. వీటిని రాయించడం వల్ల శత్రు వినాశనం జరిగి విజయాలు చేకూరుతాయని నమ్మిక.

★ అనంతరం జమ్మి ఆకును సేకరించి పెద్దలకు పంపిణీ చేసి ఆశీర్వాదం తీసుకుంటారు. ఒకరికొకరు ఈ జమ్మి పత్రిని పంచుకొని శుభాకాంక్షలు చెప్పుకుంటారు. తరువాత శుభం కలగాలని కోరుకుంటూ పాలపిట్టను దర్శనం చేసుకుంటారు. ఈ సందర్భంగా ఇంటి ఆడపడచులు మంగళహారతులు పట్టి జమ్మి పత్రిని పంచి నజరానాలు స్వీకరిస్తారు. భువనగిరి, నల్గొండ పలు పట్టణాలు, గ్రామాల్లో దసరా సందర్భంగా రావణాసురుడి దిష్టిబొమ్మను దహనం చేస్తారు. రాత్రి బాణసంచా కాల్చుతూ పెద్దలు, చిన్నారులు కేరింతలు కొడతారు.




మోత్కూరులో జమ్మిచెట్టు వద్ద పూజలు జరుపుతున్న ప్రజలు (దాచిన చిత్రం)



పాలపిట్ట దర్శనం (దాచిన చిత్రం)

పల్లెపహాడ్‌లో విభిన్నం

తెలంగాణ సాయుధ పోరాటం ముగిసిన తదుపరి వచ్చిన తొలి పండగ దసరా. నిజాంపై విజయం సాధించినందుకు ఆ రోజుకు గుర్తుగా ఆత్మకూరు(ఎం) మండలం పల్లెపహాడ్ గ్రామంలో నాటి దళ నాయకుడు చాకలి అయిలయ్య నేతృత్వంలో కమ్యూనిస్టులు పెద్ద బురుజు మీద ఎర్రజెండా ఎగరవేశారు. ఊరంతా ప్రదర్శనలు నిర్వహించి, దసరా పండగను జరుపుకున్నారు. నాటి నుంచి నేటి వరకు దసరా రోజున పల్లెపహాడ్ గ్రామంలో కమ్యూనిస్టు పార్టీతో పాటు అన్ని పార్టీల వారూ జెండాలను ఎగరవేసి ఊరంతా ప్రదర్శనలు నిర్వహిస్తూ ఉత్సాహంగా వేడుకలు జరుపుకొంటున్నారు.



పల్లెపహాడ్‌లోని బురుజుపై జెండా ఎగురవేస్తున్న నాటి చిత్రం

ఏడు దశాబ్దాలుగా ఎర్రజెండా ఎగరవేస్తున్నాం.

– కుసుమాని హరిశ్చంద్ర, పల్లెపహాడ్



మా గ్రామంలో 70 ఏళ్లకు పైగా దసరా పండగ రోజు బురుజుపై ఎర్రజెండాను ఎగరవేయడం ఆనవాయితీగా వస్తోంది. కమ్యూనిస్టు కార్యకర్తలు ఎర్రజెండాలతో గ్రామంలో ప్రదర్శన నిర్వహించిన అనంతరం దసరా వేడుకలు జరుపుకొంటారు. ఊరంతా పాల్గొనడం ఈ పండగ ప్రత్యేకత. మమ్ములను చూసి ఇప్పుడు అన్ని పార్టీల వారూ జెండాలు ఎగరవేసి ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు.

కొలువుల నిలయం.. బాపూజీ గ్రంథాలయం

డీఎస్సీలో 13 మందికి ఉద్యోగాలు



గ్రంథాలయంలో ఉద్యోగాలకు సిద్ధమవుతున్న విద్యార్థులు

కోదాడ, న్యూస్‌టుడే:

ఈ రోజుల్లో ప్రభుత్వ ఉద్యోగం అంటే ఓ కల. ఆ కలను నిజం చేసుకోవాలంటే ఎన్నో త్యాగాలు, కష్టాలు భరించాల్సి ఉంటుంది. పేద కుటుంబంలో పుట్టిన వారికి సరైన వసతులు ఉండవు. దగ్గరలో ఉండే ప్రభుత్వ గ్రంథాలయాలే వారికి దిక్కు. వాటినే ఆసరాగా చేసుకొని అవకాశం అందిపుచ్చుకునే వారు ఎందరో. ఇలాగే కోదాడ పట్టణంలోని బాపూజీ గ్రంథాలయం ఉద్యోగాలకు నిలయంగా మారుతోంది. ఏకంగా 13 మంది ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో ఉద్యోగాలు సాధించడం విశేషం. ఉమ్మడి జిల్లాలోనే అత్యధిక ఉద్యోగాలు సాధించిన గ్రంథాలయంగా రికార్డు సృష్టించింది. గతంలో గురుకుల, పోలీసు, ఏతశాఖలో పలువురు ఉద్యోగాలు సాధించగా తాజాగా విడుదలైన స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ ఫలితాల్లో ఆ సంఖ్య అమాంతం పెరగడం విశేషం.

రెండేళ్లుగా వస్తున్నా:

వెంకటేశ్వర్లు, కాపుగల్లు



గత రెండేళ్లుగా నిత్యం గ్రంథాలయానికి వచ్చి ప్రిపేరవుతున్నా. డీఎస్సీ మిత్రులతో ఒకరినొకరు సంప్రదిస్తూ సందేహాలు ఉంటే నివృత్తి చేసుకుంటాం. ప్రణాళిక ప్రకారం చదవడంతోనే ఉద్యోగం సాధించా. కష్టానికి ప్రతిఫలం రావడం ఆనందంగా ఉంది.

ఆర్థిక ఇబ్బందులు అధిగమించి:

శ్రీవిద్య, చెన్నారిగూడెం



పరీక్ష క్రితం వివాహమైనా, అప్పటి నుంచి ఉద్యోగ సాధనే లక్ష్యంగా చదువుతున్నాను. ఇద్దరు పిల్లలు ఉన్నప్పటికీ, వారి ఆలనాపాలన చూసుకుంటూ ఆర్థిక ఇబ్బందులు అధిగమిస్తూ సమయం దొరికినప్పుడల్లా గ్రంథాలయానికి వచ్చి సాధన చేశాను. ఎట్టకేలకు ఉద్యోగం రావడం ఆనందంగా ఉంది. కుటుంబ సభ్యుల సహకారంతోనే ఈ కల నిజమైంది.

అమ్మ ప్రోత్సాహంతో:

వినీత, అమీనాబాద్



అమ్మ ప్రోత్సాహంతోనే చదివాను. నేను ఉద్యోగం సాధించడం అమ్మ కల. 2015లో వివాహమైంది. ఇద్దరు పిల్లలున్నా భర్త ప్రోత్సాహం మరువలేనిది. 46వ ర్యాంకు రావడంతో ఉద్యోగం సాధించాను. గతేడాది నుంచి నిత్యం గ్రంథాలయానికి వచ్చి ప్రిపేరయ్యాను.

సాయంత్రం ఆటో నడిపి..

ఉపేందర్, కొమరబండ



నిత్యం సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి పది గంటల వరకు ఆటో నడిపి వచ్చిన డబ్బుతో కుటుంబాన్ని పోషిస్తున్నాను. ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రంథాలయంలో చదివేవాడిని. వివాహం కావడంతో కుటుంబ ఖర్చుల కోసం ఇబ్బంది పడాల్సి వచ్చింది. ఎట్టకేలకు స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగం రావడంతో నా కష్టాలు తీరిపోయాయి.


బుద్ధవనంలో దమ్మ విజయ వేడుకలు

నాగార్జునసాగర్, న్యూస్‌టుడే: బుద్ధవనంలో దమ్మ విజయం వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ ప్రకాశ్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎండీ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 14న సాగర్‌లోని బుద్ధవనంలో దమ్మ విజయం వేడుకలను నిర్వహించనున్నట్లు.. ఈ కార్యక్రమానికి పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, సాగర్ ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, లతారాజా ఫౌండేషన్ సలహాదారుడు పీఎస్ ఎన్‌మూర్తి పాల్గొంటారని పేర్కొన్నారు.

పల్లెకు పయనం

హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారి-65పై వాహనాలు శుక్రవారం బారులు తీరాయి. దసరా పండగను సొంతూళ్లలో నిర్వహించుకునేందుకు వాహనాల్లో వస్తుండడంతో చౌటుప్పల్‌లో సందడి నెలకొంది. కార్లు, ఆర్టీసీ, ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు, ఆటోలు, లారీలు, సరకు రవాణా వాహనాలు ఒకదాని వెంట ఒకటి హైదరాబాద్ వైపు నుంచి బారులు తీరి వస్తున్నాయి. సరకులు, నూతన వస్త్రాలు కొనేందుకు స్థానికులు, చుట్టుపక్కల గ్రామాలవారు ఇక్కడికి వచ్చిపోతుండడంతో పండగ రద్దీ పెరిగింది.

– న్యూస్‌టుడే, చౌటుప్పల్



నృత్య వైభవం



యాదాద్రి క్షేత్రంలో ఆధ్యాత్మిక వాతావరణం కల్పించే ఉద్దేశంతో దేవస్థానం సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహిస్తోంది. చెన్నైకి చెందిన శ్రీమైత్రి సెంటర్ ఫర్ ఆర్ట్స్ సరళ కుమారి బృందం భరత నాట్యం ప్రదర్శన చేపట్టింది. నాట్యాలయ బృందం కూచిపూడి, పేరిణి నాట్య ప్రదర్శనలు ఇచ్చింది. – న్యూస్‌టుడే యాదగిరిగుట్ట

తొమ్మిది రోజులు చుక్కా, ముక్కా బంద్



అభంగాపురంలో దుర్గాదేవి వద్ద పూజలు చేస్తోన్న భక్తులు

మాడ్గులపల్లి మండలంలోని అభంగాపురం గ్రామంలో దుర్గాదేవి నవరాత్రులను ఘనంగా నిర్వహిస్తారు. గ్రామస్థులంతా కులాలకతీతంగా ఒకే విగ్రహాన్ని నెలకొల్పి ఐక్యతతో పూజిస్తారు. తొమ్మిది రోజులు పూర్తయ్యే వరకు గ్రామంలో మద్యం ముట్టరు, మాంసం తినరు. ఇలా గత మూడేళ్లుగా కొనసాగిస్తున్నారు. చివరి రోజు రాజరాజేశ్వరి దేవి అవతారంలో భక్తులంతా కుంకుమార్చన చేయటం ఆనవాయితీ. ఇలా చేయటంతో దుర్గాదేవి గ్రామాన్ని చల్లగా చూస్తోందని వారి నమ్మకం. తొమ్మిది రోజుల పూజ తర్వాత దసరా రోజు అమ్మవారి విగ్రహాన్ని నిమజ్జనం చేస్తారు. దసరా రోజు కూడా మద్యం, మాంసం తీసుకోకపోవటం గమనార్హం. – మాడ్గులపల్లి, న్యూస్‌టుడే:

35 ఏళ్లుగా నగర సంకీర్తన

శరత్కాలంలో ప్రకృతిమాత నుంచి శక్తి సముపార్జన కోసం ఏటా దుర్గాష్టమి, నవమి, దశమి రోజుల్లో చౌటుప్పల్‌లోని శ్రీభావనారుషి కళానికేతన్ ఆధ్వర్యంలో గత 35 ఏళ్లుగా 'నగర సంకీర్తన' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కళానికేతన్ వ్యవస్థాపకులు గంజి అనంతరాములు, వ్యవస్థాపక అధ్యక్షుడు బడుగు శ్రీరాములు నేతృత్వంలో సద్దుల బతుకమ్మ నుంచి దసరా వరకు మూడు రోజులపాటు నగర సంకీర్తనను ప్రవేశపెట్టారు. ఇప్పటికీ కళానికేతన్ సభ్యులు వేకువజామున పట్టణంలోని అన్ని వీధుల్లో పర్యటిస్తూ మద్దెల, తాళాలు లయబద్ధంగా మోగిస్తూ, దైవ స్తుతి కీర్తనలు ఆలాపిస్తూ.. శరన్నవరాత్రి, దసరా ప్రాశస్త్యాన్ని వివరిస్తున్నారు. వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు సైతం నిర్వహిస్తున్నారు.

★ 'ఇంటింటా భగవన్నామ సంకీర్తన సుధాస్రవంతి' పేరుతో ప్రతి పౌర్ణమి రోజున ఒక గృహస్థు ఇంట్లో భజన చేస్తున్నారు. ఇప్పటికి 96 వారాలుగా ఈ కార్యక్రమం కొనసాగుతుంది.

★ ఏటా 'భగవద్గీత జయంతి' ఉత్సవం, ★ ఉగాది రోజున సాహిత్య, సాంస్కృతిక ఉత్సవాలు జరుపుతున్నారు. – న్యూస్‌టుడే, చౌటుప్పల్



చౌటుప్పల్‌లో నగర సంకీర్తన చేస్తున్న శ్రీభావనారుషి కళానికేతన్ సభ్యులు



బండెనక బండి కట్టి.. ఆలయ బాట పట్టి

మండల కేంద్రంలో కనకదుర్గమ్మ బండ్ల పండగను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు గురువారం రాత్రి అమ్మవారికి ప్రభబండ్లు కట్టి పురవీధుల్లో ఊరేగింపుగా బయలుదేరి శుక్రవారం ఉదయం దేవాలయానికి చేరుకున్నారు. అనంతరం ఆలయ అర్చకుడు కందాల ప్రశాంతాచార్యులు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. – న్యూస్‌టుడే, మునగాల


మహిషాసురమర్దిని రూపంలో దర్శనం

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి క్షేత్రంలో అనుబంధ శ్రీపర్వతివర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో కొనసాగుతున్న శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా తొమ్మిదో రోజు మహిషాసురమర్దిని దేవి అలంకారంలో అమ్మవారి దర్శనమిచ్చారు. పాత్రఃకాల పూజ, స్థాపిత దేవతా హవనం, అర్చన, పారాయణం, గాయత్రీ జపం, లలిత సహస్రనామార్చన నిర్వహించారు. శనివారం కలశ ఉద్వాసన, మహా పూర్ణాహుతి నిర్వహిస్తారు. ఆలయ ఈవో భాస్కర్‌రావు, ధర్మకర్త నరసింహమూర్తి పాల్గొన్నారు.




సంస్కృతి సంబరం.. పల్లె బంధం

చిట్యాల, న్యూస్‌టుడే: పండగ అంటేనే.. సంస్కృతి, సంప్రదాయం, సంబరం. ముఖ్యంగా తెలుగు పండగలు ఈ విషయానికి ప్రతీకగా నిలుస్తాయి. అందులో దసరా ప్రధానమైనది. ఉద్యోగ, ఉపాధి అవసరాల రీత్యా పట్టణాలకు, నగరాలకు వలసవెళ్లిన జీవులంతా దసరాను సొంత గ్రామంలోనే జరుపుకోవడానికి ఎక్కువగా ఇష్టపడతారు. ఎక్కడున్నా దసరాకు ఊరికి చేరుకోవాల్సిందే. ఇవన్నీ ఒక ఎత్తు అయితే బతుకమ్మ, దేవీ నవరాత్రి ఉత్సవాలు, దసరా.. అన్నీ కుంచించుకుపోతున్న మానవ సంబంధాలు మెరుగు పడటానికి దోహదం చేస్తాయి. కొందరు యువకులు దేవీ మాల పేరుతో మాలధారణ చేస్తున్నారు. తొమ్మిది రోజుల పాటు నియమ, నిష్ఠలతో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. మాంసాహారం, మద్యానికి దూరంగా సాత్వికాహారం తీసుకుంటారు. రెండు పూటలు అల్పాహారం, ఒక్క పూట మాత్రమే మిత భోజనం చేస్తారు. ఇది మాల ధారణ చేసిన వారిలో ఆధ్యాత్మిక భావన పెంచడంతో పాటు వారిని మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉంచుతుంది. తద్వారా సాటి వారితో సత్సంబంధాలు మెరుగుపడే అవకాశం ఉంది.



సొంత ఊర్లో స్వచ్ఛత కనిపిస్తుంది:

యాస శ్రీనివాసరెడ్డి, (హైదరాబాద్) చిట్యాల.



వివిధ కారణాలతో పట్టణాల్లో ఉంటున్నా, దసరాకు మాత్రం సొంతూరికి రావాల్సిందే. పట్టణంలో ఎంత మంది పరిచయం ఉన్నా, అవన్నీ ఆర్థిక పరమైన సంబంధాలుగానే కనిపిస్తాయి. ఊరికి వచ్చినప్పుడు కుల, మతాలకు తావు లేకుండా పరిచయం ఉన్న వారందరినీ వరసలు పెట్టి పిలుచుకుంటాం. అలాంటి పలకరింపుల్లో మన వాళ్లు అనే ఆప్యాయత, అభిమానం కనిపిస్తుంటాయి.

నాణ్యమైన విద్య కోసం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు: మంత్రి

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: కోటీశ్వరుల పిల్లల మాదిరిగానే పేద పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేస్తోందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్గొండ జిల్లా కేంద్రంలోని గంధంవారిగూడెంలో రూ.300 కోట్ల వ్యయంతో



నల్గొండ: గంధంవారిగూడెంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, చిత్రంలో ఎస్పీ శరత్ చంద్ర పవార్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్ తదితరులు

నిర్మించతలపెట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల పైలాన్‌ను శుక్రవారం ఆయన ఆవిష్కరించి భూమి పూజ నిర్వహించారు.

★ ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు. అన్ని వసతులతో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ విద్యార్థులందరూ కులమతాలకు అతీతంగా కలిసిమెలిసి ఈ రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుకోవచ్చన్నారు. రాష్ట్రంలో రూ.5 వేల కోట్ల వ్యయంతో మొదటి విడతలో 28 ప్రాంతాల్లో భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేసుకుంటున్నామని వివరించారు. సాగర్ ఎడమ కాల్వ ద్వారా నీరు వదిలినప్పటికీ కాల్వలో చెట్లు, పూడిక వల్ల చివరి వరకు సాగు నీరు అందదన్న ఉద్దేశంతో తన సొంత నిధులతో కాల్వల్లో మరమ్మతులు చేయించినట్లు చెప్పారు. జిల్లాలోని ప్రతి ఎకరాకు సాగు నీరు అందించి రైతుల కాళ్లు కడిగినప్పుడే తన కల నెరవేరుతుందన్నారు.

వారం రోజుల్లో ఇళ్లు లేని పేదల నుంచి దరఖాస్తులు తీసుకుని రూ.5 లక్షలతో ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తామన్నారు. తెలంగాణలో రూ.ఏడు లక్షల కోట్లు అప్పు చేసి కేసీఆర్ కుటుంబమే బాగు పడిందని విమర్శించారు. కేజీ టు పీజీ ఉచిత విద్య అని చెప్పిన కేసీఆర్ వాటిని అమలు చేయలేదని, ఆయన చెప్పిన వాటిని మేము చేస్తున్నామని, 4వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఉచితంగా విద్య ఇస్తున్నామన్నారు. నల్గొండ నియోజకవర్గం అంటే తనకు ప్రాణమని చెబుతూ ఒక సారి ఓడినా నన్ను గుండెల్లో పెట్టుకుని గెలిపించుకున్నారని, మీ అందరిని కుటుంబ సభ్యులుగా భావించి కాపాడుకుంటామని తెలిపారు. అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, ఎస్పీ శరత్ చంద్ర పవార్, మున్సిపల్ ఛైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పాల పిట్టకు ఉచిత లారీ ప్రయాణం


జ్ఞాపకం

చిట్యాల, న్యూస్‌టుడే: దసరా పర్వదినం అనగానే పాలపిట్ట గుర్తుకొస్తుంది. సుమారు 40 ఏళ్ల క్రితం చిట్యాలలో లారీ యజమానులు గ్రామం వెలుపలకు వెళ్లి పాల పిట్టను తిలకించేందుకు తమ లారీలను ప్రజలకు ఉచితంగా అందుబాటులో ఉంచేవారు. లారీలను శుభ్రంగా కడిగించి, పూల దండలతో అలంకరించి, వాహన పూజలు చేయించేవారు. పాల పిట్టను చూడాలనుకునే వారి కోసం పంచాయతీ కార్యాలయం సమీపంలో లారీలను పార్కింగ్ చేసేవారు. అందులో ఎక్కిన వారిని చిట్యాల నుంచి నార్కట్‌పల్లి వైపు తీసుకెళ్లే వారు. మధ్యలో బహిరంగ ప్రదేశంలో పాల పిట్టను చూసి చిన్నారులు కేరింతలు కొట్టేవారు. ఆ తర్వాత లారీలను నార్కట్‌పల్లికి తీసుకెళ్లి గ్రామంలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం వద్దకు తీసుకెళ్లగా అక్కడ స్వామి దర్శనం చేసుకునేవారు. అక్కడి నుంచి నేరుగా చిట్యాల మీదుగా రామన్నపేటకు వెళ్లే దారిలో చిట్యాల శివారులో ఉన్న శ్రీ బాల నరసింహ స్వామి ఆలయానికి తీసుకెళ్లి దర్శనం చేయించేవారు. చివరకు లారీని తీసుకొచ్చి చిట్యాల పంచాయతీ కార్యాలయం వద్దకు చేర్చే వారు. ప్రస్తుతం సుమారు 50 ఏళ్ల వయసు కలిగిన వారికి ఈ జ్ఞాపకం సుపరిచితమే.

చికెన్ ధరలు

ఫాంరేటు	114–00
రిటైల్	136–00
డ్రెస్డ్	197–00
స్కిన్‌లెస్	224–00

వారి విజయం వెనుక.. ఆయన శ్రమ



తండ్రి అఫ్జల్‌ఖాన్‌తో కుమారులు జావీద్‌ఖాన్, ఖదీర్‌ఖాన్

చౌటుప్పల్ బంగారుగడ్డ కాలనీలో ఒకే ఇంటికి చెందిన మహ్మద్ జావీద్ ఖాన్, ఖదీర్ ఖాన్, హసీనాలు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. డీఎస్సీ-2024లో జావీద్‌ఖాన్ సెకండరీ గ్రేడ్ టీచర్‌గా నియామకపత్రాన్ని అందుకున్నారు. అతని భార్య హసీనా 2018లో సాంఘిక సంక్షేమ శాఖ గురుకులంలో టీజీటీగా ఉద్యోగం సాధించారు. ఆమె ప్రస్తుతం ఇబ్రహీంపట్నం లోని గురుకులంలో గణితం బోధిస్తున్నారు. జావీద్ ఖాన్ తమ్ముడు ఖదీర్‌ఖాన్ గత జులైలో సాంఘిక సంక్షేమ శాఖ గురుకులంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ (పీజీటీ)గా ఉద్యోగం పొందారు. ఆయన ప్రస్తుతం వనపర్తి జిల్లా దీపనగుండ్ల గురుకులంలో ఆంగ్లం బోధిస్తున్నారు.

తమ తండ్రి అఫ్జల్ ఖాన్ నలభై ఏళ్ల నుంచి కిళ్లీ దుకాణం నడుపుతూ తమను చదివించారని, ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు సాధించడం వెనుక ఆయన శ్రమ ఉందని జావీద్‌ఖాన్, ఖదీర్‌ఖాన్ కృతజ్ఞతలు తెలిపారు. – న్యూస్‌టుడే, చౌటుప్పల్

నల్గొండ

•నల్గొండ •మునుగోడు •నకిరేకల్

14న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సభ

నీలగిరి, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ అమలు అడ్డుకోవడం కోసం ఈ నెల 14న జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో నిర్వహించే సభను విజయవంతం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కో కన్వీనర్ తాళ్లపల్లి రవి కోరారు. పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న అంబేడ్కర్ వాదులు మాల ప్రజా ప్రతినిధులు, మాల ఉద్యోగులు మహిళలు, యువకులు నిరుద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. పోరాట సమితి జిల్లా కన్వీనర్ మదుబాబు నాయకులు దున్నమల్ల అనిల్, నాగిల జోసఫ్, చింతపల్లి బాలకృష్ణ, నామ చక్రవర్తి, ప్రసాద్ పాల్గొన్నారు.

నల్గొండ జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే:

? పట్టణంలోని సాగర్ రోడ్డు మారుతి నగర్‌లో అంతర్గత రోడ్లు కాల్వలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. కాల్వ నిర్మించి సమస్య పరిష్కరించాలి. –లక్ష్మి, నల్గొండ.

✔ పట్టణంలోని విలీన గ్రామాల్లో విడతల వారిగా సీసీ రోడ్లు, కాల్వల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. అవార్డు పరిధిలో కూడా మౌలిక సౌకర్యాలు ఏర్పాటు చేస్తాం. - రాములు, ఈఈ, నల్గొండ పురపాలిక

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) 80085 52710, 80085 66199, 8008574421, 80085 74385

నిత్యావసరాల ధరల అదుపులో విఫలం

కేతేపల్లి, న్యూస్‌టుడే: రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర సరకుల ధరల అదుపులో పాలక ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం మండల కార్యదర్శి చింతపల్లి లూర్దుమారయ్య చెప్పారు. మండలంలోని బండపాలెంలో శుక్రవారం సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించిన భాజపా, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలు ప్రజలపై పన్నుల భారాన్ని మోపడమే లక్ష్యంగా పని చేస్తున్నాయని విమర్శించారు. ఆ పార్టీ మండల నాయకులు కట్ట ప్రభాత్, చెవుగోని నాగయ్య, కట్ట రోజా, ఎ.నాగయ్య, సిహెచ్.రవి పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు


నల్గొండ గ్రీన్ సిటీ కాలనీలో దుర్గామాత విగ్రహం వద్ద ప్రత్యేక పూజలో పాల్గొన్న కాలనీవాసులు


శ్రీరామ్‌నగర్ కాలనీలో అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు నిర్వహిస్తున్న భక్తులు


శ్రీనగర్ కాలనీలో అమ్మవారి మండపం వద్ద నిర్వహించిన హోమంలో పాల్గొన్న భక్తులు

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: దేవీ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని నల్గొండ పట్టణం గ్రీన్ సిటీ కాలనీలో నెలకొల్పిన దుర్గామాత విగ్రహం వద్ద కాలనీ వాసులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. కాలనీ అధ్యక్షుడు ఐతగోని యాదయ్య, పజ్జూరి పరమేశ్‌గౌడ్, మహేందర్‌రెడ్డి, హేమంత్‌రెడ్డి, గుత్త నర్సిరెడ్డి, పరమేశ్, సత్యయ్యగౌడ్, పాల్గొన్నారు.


బ్రహ్మంగారి గుట్టపైన అమ్మవారి ఆలయంలో..


మునుగోడు ప్రాచీన శివరామక్షేత్ర ఆలయంలో..

నల్గొండ కల్చరల్: దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారి మండపాలలో, ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామూహిక కుంకుమార్చనలు, హోమాలు, పూజలు జరిపించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు అన్నప్రసాదం అందజేశారు.

కనగల్: మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గామాత భక్తులకు శుక్రవారం మహిషాసుర మర్దిని దేవిగా దర్శనమిచ్చారు. దర్వేశిపురం రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద భక్తుల సందడి నెలకొంది.

గట్టుప్పల: మండల కేంద్రంలో మార్కండేయ స్వామి దేవస్థానంలో నెలకొల్పిన దుర్గాదేవి వద్ద జబర్దస్త్ నటుడు పవన్, ఆలయ అధ్యక్షుడు అవ్వారు శ్రీనివాస్, పండితులు పాపయ్య శర్మ, విద్యాసాగర్, శివరామ్, షణ్ముఖి, తదితరులు పాల్గొన్నారు.


మహిషాసురమర్దిని దేవిగా అమ్మవారు

కేతేపల్లి: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం దుర్గామాత పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. కేతేపల్లి శ్రీ శంభులింగేశ్వర స్వామి దేవాలయంలో నెలకొల్పిన విగ్రహం వద్ద మహిళలు కుంకుమ పూజ కార్యక్రమాలను నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాలలో నెలకొల్పిన అమ్మవారి విగ్రహాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఉత్సవ కమిటీ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

కట్టంగూరు: దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కట్టంగూరు మండలం అయిటిపాములలో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహం వద్ద శుక్రవారం ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు మాద యాదగిరి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పెద్ది సుక్కయ్య పాల్గొన్నారు.


మునుగోడులోని చండూరు రోడ్డులో..


గట్టుప్పల: మార్కండేయ స్వామి దేవస్థానంలో..


కేతేపల్లిలో కుంకుమ పూజ చేస్తున్న మహిళా భక్తులు

అమ్మవారి నిమజ్జన శోభాయాత్ర

నల్గొండ కల్చరల్, న్యూస్‌టుడే: దేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శనివారం అమ్మవారి పూజ జరిపించారు. కనక దుర్గ కాలనీలో అమ్మవారి నిమజ్జన శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. శోభాయాత్రలో మహిళలు భక్తులు ఆడిపాడుతూ అమ్మవారిని నిమజ్జనానికి తరలించారు.


ఊరేగింపులో కోలాటం ఆడుతున్న మహిళలు

చిట్యాల: దేవి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని చిట్యాల కనక దుర్గ ఆలయం ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అమ్మవారిని రథంపై ఊరేగించారు. ఊరేగింపు యాత్రను ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రారంభించారు. అమ్మవారు మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. పురపాలక చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు మారగోని ఆంజనేయులు, దుబ్బాక నరసింహారెడ్డి, శీలపాలెడ్డి, దేవదాను, చిన్నమల్లయ్య, కమిటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.


చిట్యాలలో అమ్మవారి ఊరేగింపు యాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

కష్టపడ్డారు.. సాధించారు

మాడ్గులపల్లి మండలంలోని ఇందుగుల గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు డీఎస్సీలో ఉద్యోగాలు సాధించారు. తల్లిదండ్రుల సహకారంతో కష్టపడ్డారు. శిక్షణ తీసుకొని స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ ఉద్యోగాలను రెండూ సాధించారు. వాటిలో స్కూల్ అసిస్టెంట్‌కు అధిక ప్రాధాన్యం ఉండటంతో ఆ పరీక్షలకు ఎంపిక చేశారు.

మాడ్గులపల్లి, న్యూస్‌టుడే:

మూడు నెలల శిక్షణ:



మాడ్గుల సుమన్, ఇందుగుల

బీపీఈడీ, పీజీ పూర్తి చేశాను. ఆ తర్వాత మూడు నెలల పాటు ఉద్యోగానికి శిక్షణ తీసుకొన్నా. రెండు నెలల కింద డీఎస్సీ పరీక్షకు హాజరు అయ్యాను. స్కూల్ అసిస్టెంట్, (ఫిజికల్ డైరెక్టర్) విభాగంలో ఏడో ర్యాంకు, ఎస్జీటీ (పీఈటీ)లో ఎనిమిదో ర్యాంకు సాధించాను. రెండు ఉద్యోగాలకు అర్హత సాధించినప్పటికీ...(ఎస్ఏ పీ.ఈ)కి ఎంపిక చేశారు. తక్కువ సమయంలోనే ఉద్యోగం రావటం ఆనందంగా ఉంది.

అప్పుడు తప్పింది...ఇప్పుడు వచ్చింది



పుట్ట సతీశ్, ఇందుగుల

2017లో డీఎస్సీ రాసినప్పటికీ కొద్ది మార్కుల తేడాతో ఉద్యోగం రాలేదు. అప్పటి నుంచి కష్టపడి చదివాను. ఇప్పటి డీఎస్సీలో ఎల్‌పీటీ నుంచి జిల్లా ఐదో ర్యాంకు పొంది, తెలుగు పండిట్ ఉద్యోగాన్ని సాధించాను. ఎస్జీటీలో 96 ర్యాంకు వచ్చింది. రెండు ఉద్యోగాలు వచ్చినప్పటికీ తెలుగు పండిట్ ఉద్యోగానికి ఎంపిక చేశారు.

పుర చైర్‌పర్సన్ బాధ్యతల స్వీకరణ


నకిరేకల్: పుర చైర్‌పర్సన్ రజిత దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్, న్యూస్‌టుడే: నకిరేకల్ పుర చైర్‌పర్సన్‌గా చౌగోని రజిత (కాంగ్రెస్) బాధ్యతలను శుక్రవారం స్వీకరించారు. ఇటీవల చైర్‌పర్సన్‌గా ఎన్నికైన విషయం విదితమే శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం, పుర వైస్ చైర్‌పర్సన్ ఉమారాణి, కమిషనర్ డి.బాలయ్య, కౌన్సిలర్లు, నాయకులు చైర్‌పర్సన్ రజితను అభినందించారు. ఎమ్మెల్యే వీరేశం మాట్లాడుతూ చైర్‌పర్సన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్న కౌన్సిలర్లకు కృతజ్ఞతలు తెలిపారు. నకిరేకల్‌ను ఆదర్శ పురపాలికగా అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే చెప్పారు. రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ శంభయ్య, కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ సభ్యుడు చామల శ్రీనివాస్, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుకన్య, నాయకులు రాఘవరెడ్డి, లింగాల వెంకన్న, కొండయ్య, వీరార్జున్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

'అందరికీ అధికారం ఎండమావేనా' కరపత్రం ఆవిష్కరణ

నల్గొండ సంక్షేమం, న్యూస్‌టుడే: నలొండకు చెందిన చొల్లేటి శ్రావణ్ కుమార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద 'అందరికీ అధికారం ఎండమావేనా' అంటూ రూపొందించిన కరపత్రాన్ని విశ్రాంత ఐఏఎస్ అధికారి, ఆ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి చొల్లేటి ప్రభాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చొల్లేటి శ్రావణ్ కుమార్ 4వ వర్ధంతి సందర్భంగా ఈ కరపత్రం ఆవిష్కరించినట్లు చెప్పారు. డా.బీఆర్.అంబేడ్కర్ రాజ్యాంగ రచనలో అందరికీ భాగస్వామ్యం ఉండాలని, సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాల కోసం మన దేశ పరిస్థితులను ఉపోద్ఘాత రూపంలో పెట్టారని వివరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలు ఈ విషయంపై ఆలోచించి ఐక్యం ఉద్యమించి సామాజిక రాజకీయ మార్పును సాధించాలని సూచించారు. ఆ ఫౌండేషన్ అధ్యక్షురాలు రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ టీఎస్‌కు రాజీనామా

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: పీఆర్టీయూ టీఎస్ సంఘం పదవికి, ప్రాథమిక సభ్యత్వానికి ఆ ఉపాధ్యాయ సంఘం జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు తరాల పరమేశ్ యాదవ్ శుక్రవారం రాజీనామా చేశారు. పీఆర్టీయూ టీఎస్ సంఘంలో సామాజిక న్యాయం లోపించిందని ఆరోపించారు. పీఆర్టీయూ టీఎస్‌లో నల్గొండ జిల్లా కార్యదర్శిగా, ఉపాధ్యక్షునిగా, ప్రచార కార్యదర్శిగా, రెండు పర్యాయాలు అసోసియేట్ అధ్యక్షునిగా సంఘం కోసం పని చేసిన తనకు ఇటీవల రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల సందర్భంగా ప్రకటించిన జిల్లా కార్యవర్గం జాబితాలో తన బాధ్యతలను తక్కువ చేస్తూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు-2గా ప్రకటించారని పేర్కొన్నారు. రాష్ట్ర, జిల్లా అధిష్ఠానం తనపై ప్రవర్తించిన తీరు కలిచి వేసిందని తెలిపారు. సామాజిక న్యాయం కొరవడిన పీఆర్టీయూ టీఎస్ సంఘంలో తన ఆత్మగౌరవాన్ని చంపుకుని మనుగడ కొనసాగలేక జిల్లా అసోసియేట్ పదవికి, సంఘం ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

కల్వర్టును ఢీకొని లారీ దగ్ధం


ప్రమాద ఘటనలో కాలిపోతున్న లారీ

చిట్యాల, న్యూస్‌టుడే: కోదాడ నుంచి హైదరాబాద్‌కు సిమెంటును తీసుకెళ్లే లారీ ప్రమాదవశాత్తు నల్గొండ జిల్లా చిట్యాల వద్ద శుక్రవారం జాతీయ రహదారిపై కల్వర్టు గోడను ఢీకొట్టి దగ్ధమయ్యింది. చిట్యాల ఎస్సై ఎన్.ధర్మా తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ నుంచి హైదరాబాద్ వెళుతున్న సిమెంటు లారీ చిట్యాలలో కల్వర్టు గోడను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో డీజిల్ ట్యాంకు దెబ్బతిని మంటలు చెలరేగాయి. ఇది గమనించిన డ్రైవరు సురక్షితంగా లారీ దిగి ప్రాణం కాపాడుకున్నాడు. దీంతో సుమారు 3 గంటల పాటు జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. చిట్యాల ఎస్సై ధర్మా ఆధ్వర్యంలో రాకపోకలను పునరుద్ధరించారు. ప్రమాద ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని ఎస్సై పేర్కొన్నారు.


జాతీయ రహదారిపై నిలిచిన వాహనాలు

సన్మానం

మర్రిగూడ, న్యూస్‌టుడే: ఇటీవల డీఎస్సీ ఫలితాల్లో ఉద్యోగం సాధించిన యరగండ్లపల్లి గ్రామానికి చెందిన ఆవంచల దర్శనం, బచ్చనగోని పుష్పలతలను ఆ గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త వల్లంల సంతోష్ యాదవ్ శుక్రవారం శాలువాలతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే వారందరికి అన్ని రకాలుగా ఆపన్న హస్తం అందిస్తానన్నారు. గ్రామస్థులున్నారు.

సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

చిట్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: సీజనల్ వ్యాధుల నియంత్రణకు వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో పి.శ్రీనివాస్ సూచించారు. చిట్యాల మండలం వెలిమినేడులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలోని ల్యాబ్, నిర్వహిస్తున్న వైద్య పరీక్షల వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారి, సిబ్బంది, ఏఎన్ఎం, ఆశావర్కర్లతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట వైద్యాధికారి నర్సింహ, సిబ్బంది ఉన్నారు.

సినిమాలు

నల్గొండ కల్చరల్, నకిరేకల్, న్యూస్‌టుడే

నల్గొండ: **నటరాజ్:** దేవర, **తిరుమల:** వేట్టయన్, **వెంకటేశ్వర:** మార్టిన్, **పీవీఎన్:** మా నాన్న సూపర్ హీరో

నకిరేకల్: **రామకృష్ణ**- వేట్టయన్, **వెంకటేశ్వర**- దేవర

టపాసుల అందజేత

చిట్యాల, న్యూస్‌టుడే: దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని చిట్యాలలో తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు కూనూరు సంజయిదాస్‌గౌడ్ తన సతీమణి సాత్వికతో కలిసి చిన్నారులకు రూ.15వేలు వెచ్చించి శుక్రవారం టపాసులు బహూకరించారు. వీటిని పెద్దల సమక్షంలో కాల్చాలని, జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రశాంత్, రాజు, శేఖర్ తదితరులున్నారు.

అక్రమార్కులపై చర్యలకు వినతి

నాంపల్లి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని మండల ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు గేర నర్సింహ శుక్రవారం మునుగోడు మండలంలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట నియోజకవర్గ ఉపాధ్యాయులు నర్సింహ, రాములు, సైదులు, నరేశ్, తదితరులున్నారు.

దసరా వేడుకలకు ఏర్పాట్లు

నకిరేకల్, న్యూస్‌టుడే: దసరా వేడుకలను నకిరేకల్‌లో శనివారం నిర్వహించేందుకు పురపాలిక ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. శమీ పూజ స్థలాన్ని మార్పుచేశారు. శనివారం సాయంత్రం స్థానిక పటేల్‌నగర్‌లోని మైదానంలో శమీ పూజ నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. గత ఏడాది ఈ పూజను మినీ స్టేడియంలో నిర్వహించారు. పూర్వకాలం నుంచి పటేల్ నగర్ మైదానంలోనే నిర్వహిస్తున్నందున ఇక్కడే ఏర్పాట్లు చేశామని అధికారులు తెలిపారు. వేడుకలను విజయవంతం చేయాలని పుర ఛైర్‌పర్సన్ చౌగోని రజిత కోరారు. సాయంత్రం 4 గంటలకు శివాలయంలో ఆయుధ పూజను నిర్వహించిన అనంతరం దసరా ప్రదర్శనను ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రారంభిస్తారని ఆలయ ఛైర్మన్ ఉప్పల రమేశ్ శుక్రవారం రాత్రి తెలిపారు. భక్తులు హాజరుకావాలని కోరారు.



ర్యాలీ చేపట్టి.. ఐక్యత చాటి

చండూరు, న్యూస్‌టుడే: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో శుక్రవారం చండూరు పట్టణంలోని ప్రధాన రహదారులపై పద సంచలన్(ర్యాలీ) నిర్వహించారు. ఏకరూప దుస్తులు ధరించి కాషాయ జెండా చేతబూని ర్యాలీ చేపట్టి ఐక్యతను చాటుకున్నారు.


చండూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

ఆర్థిక సాయం

నార్కట్‌పల్లి గ్రామీణ: యల్లారెడ్డిగూడెంకు చెందిన మన్యం శ్రీను గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆయన మృత దేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.లక్ష ఆర్థిక సాయం చేశారు. మాజీ ఉప సర్పంచి భూపాల్‌రెడ్డి, కిట్టు, శ్రీను, గణేశ్ పాల్గొన్నారు.

మిర్యాలగూడ

•మిర్యాలగూడ •నాగార్జునసాగర్ •దేవరకొండ

ఉద్యోగులకు డీఏలు ప్రకటించాలి

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: నూతన ఉద్యోగ నియామకాలతో పాటు ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు చేపట్టి వారి మన్ననలు పొందిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. దసరా, దీపావళి పండుగల సందర్భంగా ఉద్యోగులకు రెండు డీఏలు సైతం ప్రకటించి ఆదుకోవాలని బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ దశరథనాయక్ కోరారు. శుక్రవారం మిర్యాలగూడలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, అనిత, మక్లానాయక్, శ్రీను, రమేష్, లాలు, సైదా, తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:

? పట్టణంలోని గాంధీనగర్‌లో ఖాళీ స్థలంలో వ్యర్థాలు పేరుకుపోయి పందులు సంచరిస్తూ ఇబ్బందులు పడుతున్నాం.
– నాగరాజు, మిర్యాలగూడ

✔ వ్యర్థాలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. – ఎండీ యూసుఫ్, పుర కమిషనర్, మిర్యాలగూడ

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) 77994 92939 99121 74975 98487 81656

హాలియా, న్యూస్‌టుడే:

? హాలియా-మిర్యాలగూడ రోడ్డుపై ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి బస్సులు నిలపడం లేదు. – దుర్గ, హాలియా

✔ బస్సు నంబరుతో ఫిర్యాదులు చేయండి చర్యలు తీసుకుంటాం.
– సంపత్, కంట్రోలర్, హాలియా ఆర్టీసీ ప్రాంగణం

దేవరకొండ, న్యూస్‌టుడే:

? దేవరకొండ పట్టణంలోని ఖిల్లా పార్కును ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి.
– కె.రాంకోటి, దేవరకొండ

✔ పార్కు పనులు పూర్తి దశకు చేరాయి. వీలైనంత తొందర్లో ప్రారంభిస్తాం.
– రాజు, పురపాలిక ఏఈ, దేవరకొండ

కళ్లు కాయలై.. ఏడేళ్లకు చేరువై



సంధ్యాభవాని

మండల కేంద్రానికి చెందిన పురోహితులు పాల గణపతిశర్మ-రమాదేవిల కుమార్తె సంధ్యాభవాని మహాత్మా జ్యోతిరావు పులే బీసీ గురుకుల పాఠశాలలో పీఈటీ ఉద్యోగం సాధించింది. ఇటీవల ప్రభుత్వం నుంచి నియామక పత్రం అందుకుంది. సంధ్యాభవాని మాట్లాడుతూ.. ప్రభుత్వం 2017లో నిర్వహించిన ప్రవేశ పరీక్షలో ఉద్యోగం సాధించినప్పటికీ పలువురు కోర్టును ఆశ్రయించడంతో అప్పటి నుంచి పెండింగ్‌లో ఉంది. ఇటీవల ప్రస్తుత ప్రభుత్వం చొరవతో కోర్టు తమకు అనుకూలంగా తీర్పు ఇవ్వటంతో ఈ నెల ఆరో తేదీన ఉద్యోగ నియామకపత్రం అందుకున్నట్లు తెలిపారు. భర్త, తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ఉద్యోగం సాధించానని, ఏడేళ్ల తర్వాత దసరా వేడుకల్లో తాను ఈ నియామక పత్రం అందుకోవడం చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

- న్యూస్‌టుడే, కొండమల్లేపల్లి

చదువే మార్గం.. సాధ్యమైంది లక్ష్యం

మిర్యాలగూడ గ్రామీణం, న్యూస్‌టుడే:

సమాజంలో ఉన్నతంగా జీవించాలన్న.. కష్టాల కడలిని దాటాలన్నా.. చదువుతోనే సాధ్యమని, కష్టాన్ని మరిచి ఇష్టంగా చదువుకుని ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో ఉద్యోగాలు సాధించారు ఈ పేదింటి విద్యార్థులు. మండల పరిధిలోని సుబ్బారెడ్డిగూడెం గ్రామానికి చెందిన మంద కృష్ణకుమార్ ఎస్సీ కోటాలో జిల్లా మొదటి ర్యాంకు సాధించగా.. జాలుబాయితండాకు చెందిన భూక్యా సేవా ఆరు ఉద్యోగాలు సాధించారు.

చదువు మానేసి.. మళ్లీ ప్రారంభించి..



మంద కృష్ణకుమార్, సుబ్బారెడ్డిగూడెం, మిర్యాలగూడ మండలం

పదో తరగతి చదువుతుండగా నాన్న చనిపోయారు. ఆర్థిక ఇబ్బందులతో చదువు మానేసి పనులు చేశా. జీవితం మారాలంటే చదువు ఒక్కటే మార్గమని పదేళ్ల తరువాత తిరిగి చదువు ప్రారంభించి ఇంటర్, డిగ్రీ, పీజీ, బీఈడీ పూర్తి చేశా. పోటీ పరీక్షలకు సిద్ధమై.. ఈ నెల వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో ఆంగ్ల విభాగంలో స్కూల్ అసిస్టెంట్ మొదటి ర్యాంకు సాధించాను.

అమ్మానాన్నల కష్టం తొలగాలనే..



- భూక్యా సేవ, జాలుబాయితండా, మిర్యాలగూడ మండలం

మేం మొత్తం నలుగురు సంతానం. ఇద్దరు అక్కలు, చెల్లి, నేను. అమ్మనాన్న అడ్డమీద పనులకు వెళ్తూ కష్టపడి నన్ను చదివించారు. అమ్మానాన్నల కష్టాలు తొలగాలంటే చదువే మార్గమని నిర్ణయించుకుని.. మిత్రుల సాయంతో చదుకున్నాను. పీజీ పూర్తి చేసి 2020లో యూజీసీ ఎన్ఈటీ, జేఆర్ఎఫ్ సాధించా. పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ఆచార్య ప్రొఫెసర్ రెడ్డి శ్యామల పర్యవేక్షణలో పరిశోధన చేస్తున్నా. ఇటీవల వెలువడిన ప్రభుత్వ ఉద్యోగాల్లో ఆరు సాధించాను. గురుకుల జేఎల్ తెలుగు స్టేట్ 13వ ర్యాంకు, గురుకుల పీజీటీ తెలుగు స్టేట్ 8వ ర్యాంకు, గురుకుల టీజీటీ తెలుగు, టీజీపీఎస్సీ జూనియర్ లెక్చరర్ తెలుగు 13వ ర్యాంకు, డీఎస్సీ 2024 స్కూల్ అసిస్టెంట్ తెలుగు 8వ ర్యాంకు, ఎస్‌జీటీ ఆరు ఉద్యోగాలు సాధించాను.

వీధిలైట్లు ఎందుకు వేయరు..?



గుర్రంపోడు ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న చాలేడు గ్రామస్థులు

గుర్రంపోడు, న్యూస్‌టుడే: అన్ని గ్రామాల్లో దసరా పండగ సందర్భంగా వీధిలైట్లు వేశారు. మా ఊర్లో ఎందుకు వేయటంలేదని, కొన్ని లైట్లు వేసినా తక్కువ వాట్ల బల్బులు వేశారని చాలేడు గ్రామస్థులు ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం మండల పరిషత్తు కార్యాలయం వెళ్లిన గ్రామస్థులకు అధికారులెవరూ కనిపించకపోవటంతో ఓ ఉద్యోగికి వినతిపత్రం అందజేశారు. వీధిలైట్ల సంగతలా ఉంచితే కనీసం పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరాపై కూడా శ్రద్ధ చూపటంలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై ఎంపీడీవో మంజుల మాట్లాడుతూ సోమవారం వరకు వీధిలైట్లు పూర్తిగా వేయిస్తామని చెప్పారు.

జయజయహే.. మహిషాసురమర్దిని



చింతపల్లి: కుర్మేడ్‌లో..



దేవరకొండ: 14వ వార్డులో దుర్గామాత వద్ద పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్



మిర్యాలగూడ: శ్రీసాయిదత్త ఆశ్రమం గోశాలలో పూజలు చేస్తున్న భక్తులు



మిర్యాలగూడ గాంధీనగర్‌లో మహిషాసురమర్దినిగా అమ్మవారు

మిర్యాలగూడ, నాగార్జునసాగర్, దేవరకొండ నియోజకవర్గాల్లో శుక్రవారం శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా అమ్మవారిని శ్రీమహిషాసురమర్దినిగా అలంకరించారు. వివిధ గ్రామాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజా కైంకర్యాలు నిర్వహించారు. శ్రీ సాయిదత్త ఆశ్రమ గోశాలలో మహిళలు సామూహికంగా గోపూజలు చేశారు. దేవరకొండలో ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- న్యూస్‌టుడే, బృందం



మిర్యాలగూడ గ్రామీణం: శ్రీకనకదుర్గ అమ్మవారి దేవాలయంలో..



కొండమల్లేపల్లి: దుర్గానగర్ కాలనీలో పూజలో పాల్గొన్న మాజీ ఎంపీపీ దూదిపాల రేఖ-శ్రీధర్‌రెడ్డి దంపతులు



అడవిదేవులపల్లిలో..



చింతపల్లిలో...



డిండి: సింగరాజుపల్లిలో...

బతుకమ్మ పేర్చితే బహుమతే



పసునూరి రమాదేవి



బూర్గు ధనలక్ష్మి, మంజుల

బతుకమ్మ పండగంటే యువతులు, మహిళలకు ఎంతో సంబరం. తొమ్మిది రోజులపాటు వేడుకల్లో పాల్గొని సందడి చేస్తారు. మండల కేంద్రంలో జరిగే ఈ వేడుకల్లో సుందరంగా అలంకరించిన బతుకమ్మలకు ఏటా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో బహుమతులిస్తుంటారు. ఈ దఫా మండల కేంద్రానికి చెందిన పసునూరి రమాదేవి, బూర్గు ధనలక్ష్మి, మంజుల ఇటీవల 2, 10 తేదీల్లో ఒకరు రామాలయంలో, మరొకరు వాసవీ మాత ఆలయంలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొని ప్రథమ బహుమతి సాధించారు. వారికి ఆయా ఆలయ కమిటీ నిర్వాహకులు ఒక్కొక్కరికి రెండు సార్లు కలిపి ఆరు తులాల వెండి నాణేలను బహుకరించారు. రమాదేవి మాట్లాడుతూ.. గత ఎనిమిదేళ్లుగా తనకే ప్రథమ బహుమతి రావడం ఆనందంగా ఉందన్నారు. పండగకు వారం రోజుల ముందు నుంచే పూలు, ఇతర సామగ్రి సేకరిస్తానని పేర్కొన్నారు.

- న్యూస్‌టుడే, కొండమల్లేపల్లి

ఘనంగా వాహనపూజలు ... నాగార్జునసాగర్: దసరా పండగ సందర్భంగా స్థానికులు అధిక సంఖ్యలో తమ వాహనాలకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయుధ పూజ కార్యక్రమంలో భాగంగా హిల్‌కాలనీ, పైలాన్‌లోని స్థానికులు తమ వాహనాలు, ప్రభుత్వ వాహనాలను పూలతో అలంకరించి పూజలు చేశారు. ఇందులో భాగంగా నందికొండ మున్సిపాలిటీలో నిర్వహించిన వాహన పూజ కార్యక్రమంలో ఛైర్‌పర్సన్ అన్నపూర్ణ, వైస్ ఛైర్‌పర్సన్ నాగరాణి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

త్రిపురారం: దసరా పండగ సందర్భంగా మండంలోని పరిశ్రమల వద్ద కార్మికులు, యాజమాన్యం, విద్యుత్తు ఉప కేంద్రాల వద్ద సిబ్బంది శుక్రవారం ఆయుధ పూజ చేశారు. మండల విద్యుత్తు ఏఈ రవీందర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



మున్సిపాలిటీలో వాహనాలకు పూజ చేస్తున్న ఛైర్‌పర్సన్ అన్నపూర్ణ, వైస్‌ఛైర్‌పర్సన్ నాగరాణి

బంగారు ఆభరణాల చోరీ

నిడమనూరు, న్యూస్‌టుడే: ఎవరు లేని సమయంలో ఓ ఇంట్లో చోరీ జరిగిన ఘటన నిడమనూరు మండల కేంద్రంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నర్సింహ్మలగూడెంకు చెందిన కుంభం ధనలక్ష్మి తమ ఇంటి పక్కనే ఉన్న రామాలయంలో బతుకమ్మ ఉత్సవాలు జరుగుతుండగా. . వాటిని తిలకించడానికి కుటుంబసభ్యులతో కలిసి ఇంటికి తాళం వేయకుండా అక్కడికి వెళ్లింది. కొద్దిసేపటి తర్వాత ఆమె అల్లుడు రేవంత్‌రెడ్డి ఇంటికి వచ్చి తాళం వేసి వెళ్లారు. బతుకమ్మ అనంతరం అందరూ ఇంటికి వచ్చి నిద్రపోగా.. శుక్రవారం ఉదయం ధనలక్ష్మి బీరువా తీసి చూడగా అందులో ఉన్న 3.5 తులాల బంగారపు ఆభరణాలు కనిపించలేదు. దీంతో చోరీ జరిగిందని గ్రహించి నిడమనూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపాల్‌రావు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: మిర్యాలగూడ రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు రైల్వే పోలీసులు తెలిపారు. సుమారు 55 నుంచి 60 ఏళ్ల వయసు కలిగిన వ్యక్తి మృతదేహం సమీపంలో పురుగుల మందు డబ్బా సైతం పోలీసులు పేర్కొన్నారు. దీంతో ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని భావిస్తున్నారు. మృతదేహాన్ని ప్రాంతీయ ఆసుపత్రి మార్చురీకి తరలించామని.. ఆచూకీ తెలిసిన వారు పోలీసులను సంప్రదించాలని సూచించారు.

గత ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే అభివృద్ధిలో వెనుకడుగు

మాడ్గులపల్లి, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే అభివృద్ధి వెనుకడుగు వేసిందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. వేములపల్లి మండలంలోని మొల్కపట్నంలో పేదలకు ఇళ్ల పట్టాలు అందజేసి మాట్లాడారు. భారాస ప్రభుత్వంలో ఏ ఒక్క పేదవాడికి ఇళ్లు ఇవ్వలేదన్నారు. భారాస, భాజపాలు ఎన్ని కుట్రలు చేసినా అభివృద్ధి విషయంలో రాజీ పడేది లేదన్నారు. సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్, తహసీల్దారు మహ్మద్ సాదద్, డీటీ కోటేశ్వరి, హౌసింగ్ పీడీ రాజకుమార్ గోవర్ధన, పరుశరాములు, కాంతారెడ్డి, కృపయ్య, ఎల్లారెడ్డి పాల్గొన్నారు.



పేదలకు ఇళ్ల పట్టాలు అందిస్తున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

సహాయ ప్రభుత్వ న్యాయవాదులుగా నియామకం



మట్టపల్లి శ్రీధర్‌గౌడ్



గోదాల వెంకట్‌రెడ్డి

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: మిర్యాలగూడ కోర్టు సహాయ ప్రభుత్వ న్యాయవాది (భూ పరిపాలన)గా దామరచర్ల మండలం కొండ్రపోల్ గ్రామానికి చెందిన మట్టపల్లి శ్రీధర్‌గౌడ్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 25 ఏళ్లుగా మిర్యాలగూడ కోర్టులో ఆయన న్యాయవాదిగా పని చేస్తున్నారు. ఈ పదవిలో మూడేళ్ల పాటు కొనసాగనున్నారు. ★ మిర్యాలగూడ కోర్టులో 20ఏళ్లుగా న్యాయవాదిగా పని చేస్తున్న తిరుమలగిరి సాగర్ మండలం బోయగూడెం గ్రామానికి చెందిన గోదాల వెంకట్‌రెడ్డిని సహాయ ప్రభుత్వ న్యాయవాదిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మిర్యాలగూడ సీనియర్, జూనియర్ సివిల్ కోర్టుల్లో ఆయన ప్రభుత్వం తరపున వాదించనున్నారు. మూడేళ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు.

మోదీ నాయకత్వంలో దేశాభివృద్ధి

దేవరకొండ: ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో ముందుకు దూసుకెళ్తుందని భాజపా ఎస్టీ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కళ్యాణ్‌నాయక్ అన్నారు. శుక్రవారం దేవరకొండ పట్టణంలో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మోదీ నాయకత్వాన్ని బలోపేతం చేస్తూ అనేక మంది సభ్యత్వాన్ని నమోదు చేసుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. సురేష్, మల్లేష్‌నాయక్, వినోద్‌రాథోడ్, అంకూరి నర్సింహ, గుండాల అంజయ్య, భాస్కర్, రవి తదితరులున్నారు.



మహిళకు పార్టీ సభ్యత్వాన్ని నమోదు చేస్తున్న కళ్యాణ్‌నాయక్

సంక్షిప్త సమాచారం

చెడుపై మంచి సాధించిన విజయమే దసరా.. మిర్యాలగూడ: చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా అంతా విజయదశమి వేడుకలను జరుపుకుంటారని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. స్థానికంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ విజయదశమి వేడుకలను నియోజకవర్గ ప్రజలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలన్నారు.

21న ధర్నా.. మిర్యాలగూడ: లంబాడీలకు మంత్రిపదవులు ఇవ్వాలని కోరుతూ ఈనెల 21న సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి ఎదుట గిరిజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లావూరి రవీందర్‌నాయక్ తెలిపారు. స్థానికంగా శుక్రవారం అమరవీరుల స్తూపం ఎదుట గోడపత్రికలను విడుదల చేసి మాట్లాడారు. అఖిల్‌నాయక్, అంజి, లావూరి రామారావు, మురళి పాల్గొన్నారు.

నిధులు విడుదల చేయాలి.. మిర్యాలగూడ పట్టణం: అర్హులైన బీసీ విద్యార్థులు విదేశాల్లో చదువుకునేందుకు మహాత్మా జ్యోతిరావుపులే బీసీ విదేశీ విద్యానిధి పథకాన్ని అమలు చేయడంతో పాటు సరిపడా నిధులు తక్షణమే విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మిర్యాలగూడలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వెంకటేశ్వర్లు, రాంబాబు, సుధాకర్, శేఖర్ పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు.. త్రిపురారం: మండల కేంద్రంలోని బాబు సాయిపేట వెళ్లే మార్గంలో ఉన్న ఓ రైసు మిల్లులో కొంత మంది జూదమాడుతున్నారన్న సమాచారంతో శుక్రవారం కానిస్టేబుల్ వీరయ్య సిబ్బందితో అక్కడికి వెళ్లగా నామ వీరయ్య, శివనేని నాగయ్య, మాతంగి నరేష్, పడిశల శ్రీనులు జూదం ఆడుతున్నారు. వారిని అరెస్టు చేసి వారి దగ్గరి నుంచి రూ.2,280లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

సేవలు మరువలేనివి.. త్రిపురారం: మాజీ ఎమ్మెల్యే గుండెబోయిన రామ్మూర్తియాదవ్ నియోజకవర్గానికి ఆయన చేసిన సేవలు మరువలేనివని మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. మండలంలోని పెద్దదేవులపల్లిలోని ఆయన స్వగృహంలో శుక్రవారం రామ్మూర్తియాదవ్ వర్ధంతిని నిర్వహించారు. చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళిర్పించారు. గుర్వయ్యయాదవ్, శ్రీనివాస్, రాంబాబు, చంద్రశేఖర్, కోటేష్, నగేష్, రాము, వెంకన్న, సోమయ్య, సూరయ్య, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం... డిండి: మండలంలోని తవక్లాపూర్ గ్రామానికి చెందిన వేముల శ్రీకాంత్ జ్ఞాపకార్థం హైదరాబాద్ ఎస్ఎల్ఎంఎస్ ఆసుపత్రి సౌజన్యంతో శుక్రవారం రక్తదానం శిబిరం నిర్వహించారు. డాక్టర్ వేణు, రాజు, అంజి, శమీద్, రమేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

భారాసకు నట్వ రాజీనామా... చింతపల్లి: భారాస జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి నట్వ గిరిధర్ వ్యక్తిగత కారణాలతో పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. 2001 నుంచి తెరాస(భారాస), భాజపా పార్టీల్లో.. మండలాధ్యక్షుడిగా, సర్పంచిగా, ఎంపీటీసీ సభ్యుడిగా పని చేసి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని పేర్కొన్నారు. 20 ఏళ్లుగా పార్టీ కోసం కృషి చేశానని, వ్యక్తిగత, ఆరోగ్య కారణాలతో పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

సినిమాలు

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే

రాఘవ: దేవర, **వెంకటేశ్వర:** విశ్వం, **శ్రీనివాస:** వేట్టయన్
విట్రోస్: దేవర, వేట్టయన్, విశ్వం, జనక అయితే గనక